క్లుప్తంగా

లిల్లిపుట్‌లో గ్రాడ్యుయేషన్ డే



పెర్కిట్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి లిల్లిపుట్ పాఠశాలలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డేని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ రామకృష్ణ, ప్రిన్సిపాల్ దాసు పట్టాలు అందజేశారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



బాల్కొండ: మండలంలోని బోదెపల్లిలో బాల్కొండ నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను మాజీ సర్పంచ్ నోముట రవి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మోహన్, ఉపాధ్యక్షుడు రాజు, బీఆర్‌ఎస్ నాయకుడు కోట మురళి తదితరులు పాల్గొన్నారు.

బేటీ బచావోపై చిత్రప్రదర్శన



మాక్లూర్: బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంపై మండలంలోని కల్లెడి గ్రామంలో మహిళా శిశు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో గురువారం రాత్రి చిత్రప్రదర్శన నిర్వహించారు. మహిళలపై జరుగుతున్న అరాచకాలు, బాల్యవివాహాలు, లింగవివక్షతపై చిత్రప్రదర్శన ద్వారా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐకేపీ సూపర్‌వైజర్లు సునీత, సౌమ్య, కవిత, పుష్ప పాల్గొన్నారు.

ఆర్మూర్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి



ఆర్మూర్: ఆర్మూర్ పట్టణ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్యశ్రీనివాస్ సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరు వినయ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు సీఎంను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. సీఎం స్పందించి మున్సిపల్‌కు నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ పేర్కొన్నారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్‌మున్ను, కౌన్సిలర్లు ఇట్టెడి నర్సారెడ్డి, ఆకుల రాము, ఇంతియాజ్, బి రమేశ్, నాయకులు పండిత్ పవన్, సంజయ్‌సింగ్ బబ్లూ, రవిగౌడ్ ఉన్నారు.

సీఎంను కలిసిన దేగాం గంగారెడ్డి



డొంకేశ్వర్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లి గ్రామానికి చెందిన దేగాం గంగారెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని శుక్రవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. డీసీసీ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతూ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ కోసం పని చేసినందుకు గంగారెడ్డిని సీఎం అభినందించారు.

సీఎంతో జక్క రాజేశ్వర్..



బాల్కొండ: ముప్కాల్ మండలం వేంపల్లి సహకార సంఘం చైర్మన్ జక్క రాజేశ్వర్ సీఎం రేవంత్‌రెడ్డిని శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి నాగలిని అందజేసి సన్మానించారు. వేంపల్లి సంఘం అభివృద్ధికి కృషి చేయాలని కోరగా సీఎం సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. సంఘం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు.

ఇసుక ఉచితమే కానీ..

- స్థానిక అవసరాలకు ఎడ్లబండ్లపై సరఫరా చేసుకోవచ్చన్న మైనింగ్ శాఖ
- వాహనాల్లో తరలిస్తే సీనరేజ్ చార్జీలు తప్పనిసరి



సుంకెట్ వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు

మోర్తాడ్: ఇసుకను స్థానిక అవసరాలకు ఎడ్లబండ్లపై ఉచితంగా తరలించుకొనే వెసులుబాటును ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చింది. వాగు పరిసర గ్రామాల ప్రజలు సీనరేజ్ చార్జీలు చెల్లించకుండా అధికారుల అనుమతితో ఉచితంగానే తరలించడానికి 2015 నాటి నిబంధనలను అమలు చేస్తూ రాష్ట్ర మైనింగ్ శాఖ తాజా ఉత్తర్వులు జారీ చేసింది. ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తే ఒక్కో ట్రిప్పునకు రూ.900 సీనరేజ్ చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. ఎడ్లబండ్లపై ఇసుకను తరలిస్తే ఎలాంటి చార్జీలు వసూలు చేయమని గతంలోనే ప్రభుత్వం ప్రకటించింది. తాజా ఉత్తర్వులలో ఇసుక తరలింపుపై స్పష్టత లేకపోవడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. గతంలోని జీవోలను ఉటంకిస్తూ మైనింగ్ శాఖ ముఖ్య కార్యదర్శి బెన్హర్ మహేశ్ దత్తా ఎక్కా ఉత్తర్వులను జారీ చేశారు. ఇదిలా ఉండగా మైనింగ్ శాఖ ఉన్నతాధికారులు మాత్రం ఇసుక ఉచితంపై ఇంకా మార్గదర్శకాలను ప్రభుత్వం జారీ చేయాల్సి ఉందని పేర్కొంటున్నారు. జిల్లాలో ఉన్న పెద్దవాగు, కప్పలవాగు, గోదావరి, మంజీరా నది, ఇతర వాగుల నుంచి స్థానిక అవసరాలకు ఇసుకను తరలించేవారు ఇప్పటికి సీనరేజ్ చార్జీలను చెల్లిస్తూనే ఉన్నారు. ఎడ్లబండ్లపై ఇసుకను తరలించడానికి అనుమతులు ఉన్నా చాలా గ్రామాల్లో ఎడ్లబండ్ల జాడ లేదు. ఎడ్లు ఉన్నా వాటిని పసుపు పంట సాగులోనే వినియోగిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో స్థానిక అవసరాలకు ఇసుకను ఎడ్లబండ్లపై తరలించడానికి వీలు అవుతుందా అనే సందేహం వ్యక్తమవుతోంది. ట్రాక్టర్లపై స్థానిక అవసరాలకు ఇసుకను తరలించడానికి అనుమతి ఇస్తేనే వాగులు, నదుల పరిసర గ్రామాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కోడ్ ముగిసిన తరువాతే ఉత్తర్వులలో సడలింపులు ఉండే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

> **వాహనాలకు సీనరేజ్ చార్జీలు**
>
> వాగులు, నదుల నుంచి పరిసర గ్రామాల ప్రజలు వారి అవసరాల కోసం ఇసుకను తరలించడానికి ట్రాక్టర్ లేదా వాహనాలను ఉపయోగిస్తే సీనరేజ్ చార్జీలు చెల్లించాల్సిందే. ఎడ్లబండ్లపై ఇసుకను ఉచితంగానే తరలించే నిబంధన గతంలోనే ఉంది.
>
> – సత్యనారాయణ, తహసీల్దార్, మోర్తాడ్

ఆశీర్వదించండి సేవకుడిలా పనిచేస్తా



నందిపేటలో ప్రచారం చేస్తున్న బాజిరెడ్డి గోవర్ధన్



మాక్లూర్‌లో బాజిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

- ప్రచారంలో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

నందిపేట్: పార్లమెంట్ ఎన్నికల్లో తనను గెలిపిస్తే సేవకుడిలా పనిచేస్తానని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. నందిపేట మండల కేంద్రంలో రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీ వీజీ గౌడ్, జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావుతో కలిసి నిజామాబాద్ పార్లమెంట్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ముందుగా నందిపేటలోని నంది గుడి వద్ద ప్రత్యేక పూజలు చేసి మండల కేంద్రంలో పాదయాత్ర చేపట్టారు. అనంతరం నందిపేట, డొంకేశ్వర్ మండలాల బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీ అసత్య ప్రచారాలను ప్రజలకు వివరించాలన్నారు. మండల కేంద్రంలోని జూడా చర్చిలో జరుగుతున్న గుడ్ ఫ్రైడే వేడుకల్లో బాజిరెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సాయంత్రం మైనార్టీ ఫంక్షన్ హాల్ నిర్వహించిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వాకిడి సంతోష్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మచ్చర్ల సాగర్,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

రుక్మిణీవిఠలేశ్వర ఆలయంలో పూజలు

మాక్లూర్: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ మండల కేంద్రంలోని రుక్మిణీవిఠలేశ్వర ఆలయంలో స్థానిక నాయకులతో కలిసి పూజలు చేశారు. నందిపేట, డొంకేశ్వర్ మండలాలకు ఎన్నికల ప్రచారానికి వెళ్తుండగా మాక్లూర్ నాయకులతో కొద్దిసేపు ముచ్చటించారు. అనంతరం నాయకులు బాజిరెడ్డి గోవర్ధన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కోకా హైమద్, తాజొద్దీన్, కరీం, లక్ష్మీనారాయణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి



అవగాహన కల్పిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

డిచ్‌పల్లి: ప్లాస్టిక్ భూమిలో కలిసిపోవడానికి కొన్ని వందల ఏళ్లు పడుతుందని, ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి తీవ్రమైన ముప్పు వాటిల్లుతుందని ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పేర్కొన్నారు. తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని నిశిత కామర్స్ అండ్ సైన్స్ కాలేజీ(నిజామాబాద్) ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో డిచ్‌పల్లి మండలం బర్ధిపూర్‌లో నిర్వహిస్తున్న వేసవి ప్రత్యేక శిబిరం శుక్రవారం కొనసాగింది. ఈ సందర్భంగా వాలంటీర్లు ర్యాలీ నిర్వహించి, ఇంటింటికి తిరుగుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడకాన్ని మానివేసి గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రొగ్రాం ఆఫీసర్ డి.రాజన్న, పంచాయతీ కార్యదర్శి వసంత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు





ఆర్మూర్ చర్చిలో దైవసందేశం వినిపిస్తున్న పాస్టర్ , కమ్మర్‌పల్లి సియోను చర్చిలో..



నీలాక్యాంపులో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

సాక్షి, నెట్‌వర్క్: ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లోని చర్చిల్లో గుడ్‌ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. ఆర్మూర్ పట్టణంలోని సీఎస్‌ఐ చర్చిలో పాస్టర్ సూర్య ప్రకాశ్ క్రైస్తవులకు దైవసందేశం వినిపించారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని సియోను చర్చిలో పాస్టర్ అనంతరావు దైవసందేశం వినిపించారు. రెంజల్ మండలంలోని నీలాక్యాంపు, వీరన్నగుట్ట గ్రామాల్లో ఉన్న చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసు ప్రభువు శిలువతో ర్యాలీలు నిర్వహించారు. బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్ సీఎస్‌ఐ రాకాసీపేట్ క్రిస్టియన్ కాలనీలోని చర్చితో పాటు వివిధ చర్చిల్లో గుడ్‌ఫ్రైడే నిర్వహించారు. సర్వమానవాళి కోసం యేసు ప్రభువు మనిషి వలే భూ లోకానికి వచ్చి పాప విముక్తి కోసం ప్రాణ త్యాగం చేసిన పవిత్రమైన రోజు గుడ్ ఫ్రైడే అని ఫాదర్లు వివరించారు. వేల్పూర్ మండలంలోని పడగల్, వేల్పూర్, మోతె, పచ్చలనడ్కుడ, అక్లూర్, జాన్కంపేట్ చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



బోధన్‌లోని సీఎస్‌ఐ చర్చిలో..



మాక్లూర్ మండలం మాదాపూర్‌లో..

రైతు లేనిదే సహకార సంఘాలు లేవు



రుద్రూర్‌లో మాట్లాడుతున్న విండో చైర్మన్

- మహాజన సభల్లో విండో చైర్మన్లు

రుద్రూర్: రైతు లే నిదే సహకార సంఘాలు లేవని పలువురు విండో చైర్మన్లు అన్నారు. ఆర్మూర్, బాల్కొండ, బోధన్ ని యోజకవర్గాల్లోని పలు విండోల ఆధ్వర్యంలో శుక్రవారం మహాజన సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు సభలో పలు తీర్మానాలు చేశారు. వరి కోతలు ప్రారంభమైనందున ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రుద్రూర్ వ్యవసాయ సహకార సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. రుద్రూర్ సింగిల్ విండో 88వ మహాజన సభ సంఘం అధ్యక్షుడు బి సంజీవరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. కొనుగోలు కేంద్రాలు లేక పంటను దళారులకు తక్కువ ధరకు అమ్ముకుంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అక్కపల్లి సుజాతనాగేందర్, జడ్పీటీసీ నరోజి గంగారాం, విండో డైరెక్టర్లు, సభ్యులు పాల్గొన్నారు.

సంఘం అభివృద్ధికి సహకరించాలి

బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్లలో మహాజన సభను చైర్మన్ కోటొట్టి గంగాధర్ అధ్యక్ష తన నిర్వహించారు. సహకార సంఘ ఆదాయ, వ్యయాలను చదివి వినిపించారు. సంఘం అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సంతోష్, డైరెక్టర్లు, సీఈవో గంగాధర్, రైతులు పాల్గొన్నారు.

పంట రుణమాఫీని అమలు చేయాలి

బోధన్: రాష్ట్ర ప్రభుత్వం రూ. 2లక్షల పంట రుణ మాఫీని అమలు చేయాలని కోరుతూ హున్సా సొసైటీ మహాజన సభ తీర్మానాన్ని ఆమోదించింది. సాలూ ర మండలంలోని హున్సా సొసైటీ మహాజన సభ చైర్మన్ మందర్న రవి అధ్యక్షతన నిర్వహించారు. పొద్దుతిరుగుడు పంటను ప్రభుత్వం కొనుగోలు చేయాలని, సొసైటీ ద్వారా రైతులకు ఇచ్చే పంట రుణ పరిమితిని పెంచాలని కోరుతూ చేసిన తీర్మానాలను మహాజన సభ ఆమోదించిందని చైర్మన్ తె లిపారు. సొసైటీ ఉపాధ్యక్షుడు కులకర్ణి వినోద్ బా బా, డైరెక్టర్లు ఖాజాపూర్ అశోక్, రమేశ్, రాములు, ముద్ద సంగారం, సిద్ధార్థ్, సీఈవో ముద్ద హన్మంత్‌రావు, రైతులు, సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు తీర్మానాలు

నవీపేట: మండలంలోని ఫకీరాబాద్ గ్రామంలో నాగేపూర్ సొసైటీ చైర్మన్ శైలేష్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన మహాజన సభలో పలు అభివృద్ధి పనులకు తీర్మాణాలు రూపొందించారు. నూతనంగా నిర్మించిన భవనంలో ఫర్నీచర్, ఎలక్ట్రానిక్ పరికరాల కొనుగోలు, భవనం చుట్టూ ప్రహరీ, ఎలాంటి షరతులు లేకుండా ఫేక కాలంలో రూ. 2 లక్షల వరకు రుణ మాఫీ చేయాలని తీర్మాణాలు చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, సీఈవో రమేశ్, క్లర్క్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



రెంజర్ల సభలో మాట్లాడుతున్న చైర్మన్



సభలో మాట్లాడుతున్న నాగేపూర్ సొసైటీ చైర్మన్

నేడు సాలూర సొసైటీ మహాజన సభ

బోధన్: సాలూర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సభను చైర్మన్ అల్లె జనార్దన్ అధ్యక్షతన శనివారం ఉదయం సంఘం కార్యాలయంలో నిర్వహించనున్నట్లు సొసైటీ సీఈవో బస్వంత్‌రావు పటేల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం డైరెక్టర్లు, సభ్యులు, రైతులు సకాలంలో సభకు హాజరు కావాలని కోరారు.

పొతంగల్ మహాజన సభలో గందరగోళం

- పాలక వర్గం తీరుపై సభ్యుల అసంతృప్తి



పొతంగల్‌లో పాలకవర్గంతో వాగ్వాదం చేస్తున్న సభ్యులు

రుద్రూర్: పొతంగల్ మండల కేంద్రంలోని విశాల సహకార సంఘం మహాజన సభలో సంఘ పాలకవర్గం, సిబ్బంది తీరుపై సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం విండో చైర్మన్ శాంతీశ్వర్ పటేల్ అధ్యక్షతన పొతంగల్ విండో మహాజన సభ నిర్వహించారు. ఓ దశలో పాలకవర్గం, సభ్యుల మధ్య వాగ్వివాదం, తీవ్ర గందరగోళ పరిస్థితి నెలకొంది. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తున్న విండో సీఈవోను తొలగించాలని సభ్యులు డిమాండ్ చేశారు. సిబ్బంది పనితీరును పర్యవేక్షించడంలో అలసత్వం ప్రదర్శిస్తున్న పాలక వర్గం ఎందుకని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఈ రెండు అంశాలపై తీర్మానం చేసినా ప్రయోజనం శూన్యమని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యదర్శి అలసత్వంతో సంఘానికి ఆర్థిక నష్టం కలుగుతోందని సభ్యులు ఆరోపించారు. సరైన సమయంలో ఐటీ రిటన్స్, సెల్ టాక్స్ తదితర టాక్స్‌లు సకాలంలో చెల్లించనందున సంఘానికి వచ్చిన రూ. కోట్ల నష్టాన్ని బాధ్యుల నుంచి రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. సంఘ కార్యదర్శిని తొలగించి, పాలకవర్గం రద్దు చేయాలని తీర్మానం చేశారు.

కాంగ్రెస్ పార్టీది దోపిడీ రాజ్యం

- బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

భీమ్‌గల్: కాంగ్రెస్ పార్టీది దోపిడీ రాజ్యమని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు. భీమ్‌గల్ పట్టణ కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన రైతు పోరుబాట కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ అంటేనే పైరవీ అని రాష్ట్రంలో ఆ పార్టీ నాయకులు అందరినీ బెదిరించి కమీషన్ వసూలు చేస్తోందని అంతేకాకుండా నియోజకవర్గంలోని నాయకులు ప్రభుత్వ కార్యాలయాలను పంచుకొని పైరవీలు చేస్తున్నారని ఆరోపించారు. వరికి రూ.500 బోనస్ ఇచ్చి, కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వ హయాంలో జిల్లాలో 490, నియోజకవర్గంలో 100కు పైగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. ప్రస్తుతం భీమ్‌గల్‌తో పాటు చుట్టు పక్కల గ్రామాల రైతులు ఇప్పటికే దళారులకు ధాన్యాన్ని అమ్మేశారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చిల్లర మాటలు మాని ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కొందరు తమ పార్టీ వీడినంత మాత్రానా బీఆర్‌ఎస్‌కు వచ్చిన నష్టమేమీ లేదని నికార్సయిన నాయకులు, కార్యకర్తలు నాతో, కేసీఆర్‌తో ఉంటారని అన్నారు. ఉన్నవాళ్లమే కాంగ్రెస్ ప్రభుత్వ మెడలు వంచి హామీలను అమలు చేయిస్తామన్నారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. మోర్తాడ్, భీమ్‌గల్, కమ్మర్‌పల్లి మండలాల నాయకులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం

బాల్కొండ/ వేల్పూర్: బాల్కొండ మండల కేంద్రంలోని వీ కన్వెన్షన్ హాల్‌లో బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశంలో నిజామబాద్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్,ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ సురేశ్‌రెడ్డి పాల్గొంటారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. వేల్పూర్ మండలం లక్కోరలోని ఏఎన్‌జీ గార్డెన్‌లో పార్టీ నాయకుల, కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ ఉమ్మడి బాల్కొండ మండల నాయకులు తెలిపారు. సమావేశానికి ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. అనంతరం వేల్పూర్‌లోని రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, మండల కేంద్రంలో పాదయాత్ర చేపడతారని అన్నారు. కార్యక్రమాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

ఎంపీపీపై అవిశ్వాసం..

మాక్లూర్: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మాస్తప్రభాకర్, వైస్‌ఎంపీపీ సుక్కి సుజాతపై శనివారం ఉదయం 11 గంటలకు అవిశ్వాస తీర్మాణం ఉందని ఎంపీడీవో జె క్రాంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్డీవో రాజేంద్రకుమార్ నేతృత్వంలో అవిశ్వాసం ఉటుందని అన్నారు. సభ్యులు సకాలంలో హాజరు కావాలని పేర్కొన్నారు.

కరెంట్ సరఫరాలో అంతరాయం..

నవీపేట: మండలంలోని రాంపూర్, కమలాపూర్, కోస్లీ, యంచ సబ్ స్టేషన్‌లలో శనివారం మరమ్మతులు నిర్వహించడంతో వాటి పరిధిలోని గ్రామాల్లో కరెంట్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ సుహాసిని శుక్రవారం తెలిపారు. మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	ఓం భీం బుష్ (తెలుగు) - 4.05 లైన్‌మెన్ (తెలుగు) - 7.15 గామి (తెలుగు) - 10.00
స్క్రీన్-2 –	ప్రేమలు (తెలుగు) - 12.00, 3.15, 6.30, 9.45
స్క్రీన్-3 –	ఓం భీం బుష్ (తెలుగు) - 11.00, 2.10, 6.05, 9.15
స్క్రీన్-4 –	రజాకార్ (తెలుగు) - 12.15, 3.30, 6.45, 10.00

పార్టీ గెలుపునకు కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

బోధన్‌టౌన్: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త పార్టీ గెలుపునకు కృషి చేయాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. పట్టణ శివారులోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో ఢిల్లీ ప్రయాసం- మోదీ వికాసం కార్యక్రమంలో భాగంగా బోధన్ నియోజకవర్గ నాయకుల, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీ హాజరై మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి కార్యకర్త పనిచేసి మోదీని గెలిపించాలని కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి, మోహన్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, రమణి, గద్దె భూమన్న, మేక సంతోష్ పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



కమ్మర్‌పల్లి: మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 2003–04కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అనంతనం నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూ ర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అలీసాగర్ ఫిల్టర్ బెడ్ పరిశీలన



ఎడపల్లి(బోధన్): నిజామాబాద్ నగరానికి మంచినీటిని అందిస్తున్న ఎడపల్లి మండలంలోని అలీసాగర్ ఫిల్టర్ బెడ్ (మంచినీటి శుద్ధి కేంద్రం)ను అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. నీటి శుద్ధి కేంద్రంలో కొత్త పరికరాలు ఏర్పాటు చేయలేదని, ఏళ్లుగా వాడుతున్న పరికరాలతో నీరు పూర్తిస్థాయిలో శుద్ధి కావడం లేదన్నారు. సమస్యను త్వరగా పరిష్కరించి, నగర ప్రజలకు తాగునీటికోసం ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న నీ రు మరో రెండు నెలల వరకు సరిపోతుంద ని, ఆ తరువాత సమస్య ఎదురైతే నీటి సరఫరాకు ప్రణాళిక రూపొందిస్తామన్నారు. ఆయనవెంట కార్పొరేటర్లు, బీజేపీ నాయకులు ఉన్నారు.